క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మేనేజర్ జాకీర్ హుసేన్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. జహీరాబాద్ డిపో పరిధిలోని ప్రజలు ఆర్టీసీకి సంబంధించిన సమస్యలు, సందేహాలు, సలహాలు, సూచనలు 99592 26269 నంబర్‌కు తెలపాలని కోరారు.

తల్లిదండ్రులదే బాధ్యత

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు: సీఐ సుమన్‌కుమార్



సంగారెడ్డి క్రైమ్: మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులదే బాధ్యత అని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ సుమన్ కుమార్ హెచ్చరించారు. జాతీయ రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, అందుకు తల్లిదండ్రులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు. ఇష్టానుసారంగా మైనర్లు వాహనాలపై ట్రిబుల్ రైడింగ్ చేస్తున్నారని, ఇక మీ ఆటలు సాగవన్నారు. ఆకతాయిలను కట్టడి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన కోరారు.

సీపీఎం పార్టీ జెండా ఆవిష్కరణ



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని దౌల్తాబాద్ గ్రామంలో సీపీఎం పార్టీ జెండాను శుక్రవారం ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకుడు మహిపాల్ మాట్లాడుతూ.. ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరిగే రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల నాయకుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డికి శుక్రవారం కార్పొరేటర్ పుష్ప వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ రామచంద్రాపురం డివిజన్ సమస్యలపై వినతిపత్రం అందజేయడం జరిందన్నారు. ప్రధానంగా శ్రీనివాస్‌నగర్ కాలనీలోని బాలవిహార్ పార్కులో మిగిలి ఉన్న పనులకు నిధులను మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. డివిజన్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించాలని జోనల్ కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

సమస్యలపై పోరాటం



సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కంది(సంగారెడ్డి): ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నర్సింలు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చెర్లగూడెం, కంది, ఎద్దు మైలారం, ఎర్దనూర్‌లో సీపీఎం జెండాలను ఆవిష్కరించి మాట్లాడారు. హక్కుల సాధన కోసం ప్రజలందరూ ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 25 నుంచి 28 వరకు జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ శ్రీనివాస్, నాయకులు నర్సింలు, ఆనంద్, సుజాత, షబానా, నసీమా, రాజేష్, రాజమల్లయ్య, నరేందర్, శేఖర్, రత్నయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి నుంచి పాత బస్టాండ్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి గతంలో కోన్స్ ఏర్పాటు చేశారు. వాహనాలు ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగించడంతో అవి విరిగిపోయాయి. వాటికి బిగించిన బోల్టులు అలాగే ఉండడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

విస్తారంగా ఆలు, అల్లం పంటలు

- నెల రోజుల్లో చేతికి రానున్న అల్లం
- పొలంలో నుంచి ఆలుగడ్డ పంట తీస్తున్న రైతులు



సాగులో ఉన్న అల్లం పంట



ఆలుగడ్డ పంట

జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంతంలో అల్లం, ఆలుగడ్డ పంటలు విస్తారంగా సాగులో ఉన్నాయి. సాగులో ఉన్న ఆయా పంటలు ఆశాజనంగా ఉండి దారిన వెళ్లే వారిని ఇట్టే ఆకర్శిస్తున్నాయి. ఆయా పంటలను దారిన వెళ్లే వారు మరీ చూసివెళుతున్నారు. గత ఏడాది అల్లం పంటకు మంచి ధర పలికినందున రైతులు మే, జూన్ మాసాల్లో విస్తారంగా సాగు చేశారు. ఒక్కో రైతు 5 నుంచి 20 ఎకరాల వరకు సాగు చేసుకున్నారు. సుమారు 2వేల ఎకరాల్లో అల్లం పంట సాగైనట్లు అంచనా. మరో నెల రోజుల్లో అల్లం పంట చేతికి అందిరానుంది. ప్రస్తుతం మార్కెట్లో ధర అంతంత మాత్రంగానే ఉంది. క్వింటాలు ధర రూ.4వేలు పలుకుతోంది. ధర పెరిగే అవకాశం ఉన్నట్లు రైతులు ఆశతో ఉన్నారు. ఆలుగడ్డ పంట సైతం జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో విస్తారంగా సాగైంది. సుమారు 3వేల ఎకరాల్లో సాగైనట్లు అంచనా. గత రెండు రోజుల నుంచి పంట తీసే పనులకు రైతులు శ్రీకారం చుట్టారు. నెల రోజుల పాటు ఆలుగడ్డ మార్కెట్‌కు తరలనుంది. ప్రస్తుతం మార్కెట్లో మంచి ధర లభిస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. క్వింటాలు ధర రూ.1,600 నుంచి 2వేలు పలుకుతోంది.

మౌలిక వసతులకు పెద్దపీట

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిన్నారం మండలం అండూర్, సోలక్‌పల్లి, రాళ్లకత్వ, ఊట్ల, కొర్లకుంట, జిన్నారం, జంగంపేట, వావిలాల, అలీనగర్ గ్రామాలలో రూ.3.90 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులకు కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ రెడ్డి, తహసీల్దార్ భిక్షపతి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్. మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, నాయకులు రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

గుమ్మడిదలలో...

గుమ్మడిదల మండల కేంద్రంలో రూ.40 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, నాగేందర్ గౌడ్, నర్సింగ్ రావు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించండి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలని కోరుతూ శుక్రవారం ఆ ప్రాంతానికి చెందిన పుర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి వినతిపత్రం అందించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బీరంగూడ ప్రాంతంలో ప్రజల అవసరాల కోసం కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. 993 సర్వే నంబర్‌లో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమిని కేటాయించాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, ఎడ్ల రమేష్, ఆదెల్లి రవీందర్ పాల్గొన్నారు.

ఆ భూములకు 'భరోసా' లేదు



వ్యవసాయేతర భూముల గుర్తింపులో ఏడీఏ నూతన్‌కుమార్

కంగ్టి(నారాయణఖేడ్): పంటలు పండించడానికి యోగ్యమైన భూమికి మాత్రమే రైతు భరోసా వస్తుందని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ తెలిపారు. మండలంలోని జమ్గి(కే), జమ్గి(బీ), తడ్కల్, కంగ్టి గ్రామాల్లో శుక్రవారం రైతు భరోసా సర్వే చేశారు. సర్వే నంబర్ల వారీగా ఇళ్ల స్థలాలు, ఇళ్లుగా మారిన కాలనీలు, వెంచర్లు, పరిశ్రమలు, రోడ్లు, ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్న భూములు, రాళ్లురప్పలు ఉండి వ్యవసాయానికి అనువుగా లేని భూములు, కొండలు గుట్టలు కలిగిన భూములను రైతుభరోసా నుంచి తొలగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు భార్గవ్, హన్మండ్లు, స్వాతి పాల్గొన్నారు.

కల్హేర్‌లో..

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ మండలంలో తహసీల్దార్ శివ శ్రీనివాస్ శుక్రవారం సాగుకు యోగ్యం లేని భూములు పరిశీలించారు. రాపర్తి, కృష్ణాపూర్, మీర్ఖాన్‌పేట, తదితర చోట్ల సర్వే పరిశీలించారు. ఏఓ వెంకటేశం, ఏఈఓ కృష్ణావేణి పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో..

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండలంలోని జహీరాబాద్, అల్గోల్, సత్వార్, గోవింద్‌పూర్, అనేగుంట, ఒంటిలగడ్డ తండా, హుగ్గెల్లి, రాయిపల్లి తదితర గ్రామాల్లో అధికారులు పర్యటించారు. గ్రామం మ్యాప్ ఆధారంగా ఎక్కడెక్కడ నాన్ అగ్రికల్చర్ భూములు ఉన్నాయో గుర్తించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, ఏడీఏ భిక్షపతి, ఏఓ.లావణ్య, ఏఈఓ. ప్రదీప్‌కుమార్, వీరేందర్, రాజు, దత్తు,శివప్రియా, ఆర్ఐ. రుక్మోద్దీన్,డీటీ సతీష్, సర్వేయర్ శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాలు

జహీరాబాద్ టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు, కర్షకుల సమస్యలను పట్టించుకోవడం లేదని సీపీఎం ఏరియా కార్యదర్శి బీ.రాంచందర్ అన్నారు. పట్టణంలోని శ్రామిక్ భవనంలో సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, సామాన్య ప్రజలు, కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని, సీపీఎం ప్రజల పక్షాన నిత్యం పోరాటాలు చేస్తుందన్నారు. 25 నుంచి మూడు రోజు వరకు సంగారెడ్డిలో సీపీఎం రాష్ట్ర మహాసభలు కొనసాగుతాయని, ప్రజల సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మహిపాల్, సలీమోద్దీన్, నరేశ్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు

కంగ్టి(నారాయణఖేడ్): రైతులకు రసాయన ఎరువులు, క్రిమి సంహారకాలు అధిక ధరలకు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని తడ్కల్ గ్రామంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు పరిశీలించి స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. రైతులకు పంటలపై పిచికారీ చేసే క్రిమిసంహారకాలు నాణ్యమైనవి అమ్మాలని సూచించారు.

సాగు యోగ్యం కాని భూముల గుర్తింపు

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో సాగు యోగ్యం కాని భూముల సర్వే కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది 8 బృందాలుగా ఏర్పడి అన్ని గ్రామాల్లో పర్యటిస్తున్నారు. వ్యవసాయానికి యోగ్యం కాని భూములను గుర్తించేందుకు అడవి బాట పట్టారు. కార్యక్రమంలో ఏఓ అభినాష్ వర్మ, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

పాదయాత్ర

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి విజయం సాధించాలని కోరుతూ శుక్రవారం రామచంద్రాపురం బీజేపీ మహిళ మోర్చా అధ్యక్షురాలు బసమ్మ, భారతినగర్ డివిజన్ మహిళ మోర్చా అధ్యక్షురాలు గీతా ఆధ్వర్యంలో స్థానిక పంచముఖి ఆంజనేయస్వామి ఆలయం నుంచి పటాన్‌చెరు రుద్రారం గణేష్ గడ్డ ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



వైద్యుడిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

నారాయణఖేడ్: మనూరు మండలం ఎల్గొయి గ్రామానికి చెందిన బాజ్జి గోవింద్‌రావు శుక్రవారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఖేడ్ ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రుడిని పరామర్శించారు. వైద్యుడిని అడిగి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అదేగ్రామానికి చెందిన విఠల్‌రెడ్డి గుండె శస్త్ర చికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా ఆయననూ పరామర్శించారు. ఖేడ్ మండలం నమ్లిమెట్‌కు చెందిన రామయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. గ్రామానికి వెళ్లి ఆయన కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట మనూరు మండల బీఆర్ఎస్ అధ్యక్షులు విఠల్‌రావు, నాయకులు రాజేందర్‌రావు, గణపతిరావు, హరికృష్ణ, అశోక్, లక్ష్మారెడ్డి, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య

రాయికోడ్(అందోల్): వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగారం గొల్ల అంజయ్య తెలిపారు. శుక్రవారం రాయికోడ్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో రూ. 15 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాయికోడ్ మాజీ సర్పంచ్ కేదర్‌నాథ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏసయ్య, డైరెక్టర్ విఠల్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం

ఆర్టీసీ డీఎం మల్లేశయ్య



నారాయణఖేడ్: ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం సాధ్యమని నారాయణఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. శుక్రవారం డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు. ప్రభుత్వరంగ సంస్థ అయిన ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని, సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు. వట్‌పల్లి నుంచి వెంకటభాజ ట్రస్టు ఉపాధ్యక్షులు రాములు చిప్తీ ఫోన్ చేసి ఖేడ్ నుంచి వట్‌పల్లి, సింగూరు, సదాశివపేట, వికారాబాద్‌ల మీదుగా బూర్గుపల్లికి బస్సు నడపాలని కోరారు. మంగల్‌పేట్‌కు చెందిన వెంకటేశం మాట్లాడుతూ ఖేడ్ డిపో నుంచి వచ్చే అన్ని బస్సులు మంగల్‌పేట్ బస్టాండ్‌కు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ముస్తాపూర్ మీదుగా బస్సు నడపాలని విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలను నమోదు చేసుకున్న డీఎం.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు.

ఘనంగా సిద్ధివినాయక జయంత్యోత్సవాలు



పూర్ణాహుతిలో పాల్గొన్న దంపతులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్ గ్రామ శివారులో వెలసిన శ్రీ సిద్ధివినాయక ఆలయంలో శుక్రవారం స్వామివారి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి వేదఘోషం, దీప ప్రజ్వలన, ధ్వజారోహణం, స్వస్తి పుణ్యాహవచనం, అభిషేకం, దేవతా ఆహ్వానం, యజ్ఞాలు, హారతి, తీర్థ ప్రసాద వితరణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పునీత్ దీక్షిత్ ఆధ్వర్యంలో నిర్వహించిన యజ్ఞాలు స్వామి వారి నామస్మరణంతో మారుమోగాయి. కార్యక్రమంలో రాజ్‌కుమార్, మల్లికార్జున్, సంగారెడ్డి, గుండ్‌రెడ్డి, మల్లన్న, మహేష్, నరేష్, నవీన్ పటేల్, ఈరన్న పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు మాధవానంద సరస్వతి

స్వామి జయంతి ఉత్సవాలకు తొగుట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతీ హాజరయ్యారు. ఆయనకు అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పొంచి ఉన్న ప్రమాదం



దెబ్బతిన్న సైడ్ రేలింగ్

ప్రమాదకరంగా రాంనగర్ రైల్వే బ్రిడ్జి

జహీరాబాద్ టౌన్: వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే పట్టణంలోని రాంనగర్ రైల్వే బ్రిడ్జి మీదుగా ప్రయాణమంటే ప్రజలు భయపడిపోతున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన దెబ్బతింది. ముఖ్యంగా సైడ్‌రేలింగ్ (పిట్ట గోడలు) శిథిలావస్థకు చేరి కూలుతున్నాయి. పలుచోట్ల సైడ్ రేలింగ్ కూలిపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల ఓ వాహనం ప్రమావశాత్తు సైడ్ రేలింగ్‌పైకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తు వాహనం మధ్యలో ఆగిపోయింది. కింద పడి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేది. సుమారు 25 సంవత్సరాల క్రితం జహీరాబాద్–తాండూరు రహదారి మధ్యలో రైలు పట్టాలపై రాంనగర్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. నిత్యం వాహనాల రద్దీ ఉండే ఈ బ్రిడ్జి రోడ్డు అక్కడక్కడ దెబ్బతింది. సైడ్ రేలింగ్ శిథిలావస్థకు చేరడంతో పలు చోట్ల కూలిపోతుంది. ఒకటి రెండు చోట్ల ప్రమాదం పొంచి ఉంది. బ్రిడ్జిపై నుంచి కాలినడకన వెళ్లే వారు జారిపడే ప్రమాదం లేకపోలేదు. వంతెనను నిర్మించిన తర్వాత సాధారణ మరమ్మతులు కూడా చేపట్టడంలేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. బ్రిడ్జి పొడుగునా ఏర్పాటు చేసిన వీధి దీపాల్లో చాలా వరకు వెలగడం లేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి దెబ్బతిన్న వంతెనకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ శ్రీ సిద్దేశ్వర దేవస్థానం హుండీ లెక్కింపు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణ సమీపంలో అల్గోల్ రోడ్డులో గల శ్రీసిద్దేశ్వర దేవస్థానం హుండీని శుక్రవారం లెక్కించారు. ఆలయ ఈఓ శివరుద్రప్ప, సూపరింటెండెంట్ శివరాజ్ పర్యవేక్షణలో ఈ లెక్కింపు జరిగింది. ఏడు నెలలకు గాను ఆలయంలోని హుండీలలో భక్తులు వేసి కానుకల రూపంలో రూ.53,975 నగదు వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఈ సందర్భంగా 2025–26 సంవత్సరానికి కొబ్బరి కాయలు, పూజా సామగ్రి విక్రయాలకు సంబంధించి బహిరంగ వేలం పాట నిర్వహించారు. వేలం పాట ద్వారా రూ.1.77 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సంగమేశ్వర స్వామి తదితరులు పాల్గొన్నారు.

◆ రేపు ఖేడ్‌లో రక్తదాన శిబిరం

నారాయణఖేడ్: మహారాష్ట్రలోని జగద్గురు నరేంద్రాచార్య మహారాజ్ సంస్థానం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నారాయణఖేడ్ ప్రాంతీయ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సాంప్రదాయ జిల్లా సేవాసమితి అధ్యక్షులు సోస్వరూప్ తెలిపారు. రక్తదాతలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

◆ రేషన్ కార్డుల సర్వే

కల్హేర్ (నారాయణఖేడ్): మండలంలో రేషన్ కార్డుల సర్వే పనులను ఎంపీడీఓ రమేష్‌బాబు పరిశీలించారు. కల్హేర్, మాసాన్‌పల్లి, బాచేపల్లిలో రేషన్ కార్డు వివరాలు నమోదు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కృష్ణచారి, రజనీకాంత్, సిబ్బంది నగేష్, షాకీర్, పరమేశ్ పాల్గొన్నారు.

◆ గుమ్మడిదలను సందర్శించిన ఆర్డీఓ

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండల కేంద్రాన్ని ఆర్డీఓ రవీందర్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసా, ఆహార భద్రత కార్డుల ఎంపిక ప్రక్రియపై చర్చించారు. ఈ ప్రక్రియను సజావుగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాభవానీ, ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

◆ నేడు ఉచిత నేత్రవైద్య శిబిరం

నారాయణఖేడ్: స్థానిక షిర్డీసాయిబాబా ఆలయ ఆవరణలో శనివారం ఉదయం 10గంటల నుంచి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నాయీబ్రాహ్మణుల కోసం ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం నాయకులు నరేందర్, సత్యనారాయణ, సాయిలు, శంకర్ తెలిపారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా చేయిస్తారని, నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

◆ రేషన్‌కార్డుల పరిశీలన

కంగ్టి(నారాయణఖేడ్): మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఎంపీడీఓ సత్తయ్య ఆధ్వర్యంలో శుక్రవారం రేషన్ కార్డుల పరిశీలించారు. పాతకార్డులలో పేర్లమార్పు, నూతన కార్డుల కోసం చేసుకొన్న దరఖాస్తుల్లో ఉన్న పేర్లను తనిఖీ చేశారు. ఎంపీఓ సుభాష్‌తోపాటు పంచాయతీరాజ్ సిబ్బంది పరిశీలనలో పాల్గొన్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజలు తమ వద్ద ఉన్న రేషన్, ఆధార్‌కార్డులు అధికారులకు చూపించి సహకరించాలని కోరారు.

◆ అభివృద్ధి పనులు పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను శుక్రవారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరతిగతిన పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యురాలు శారద, సుధాకర్ రెడ్డి, కల్యాణ్ పాల్గొన్నారు.

◆ పాల ఉత్పత్తిపై దృష్టిసారించాలి

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని చింతల్ చెరువులో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పాల ఉత్పత్తిపై పాల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా మండల పశువైద్యాధికారి హేమలత మాట్లాడుతూ.. గోపాలమిత్రల సేవలను పాల ఉత్పత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు నాణ్యమైన పాల కోసం ఎదురు చూస్తున్నారని, పాల ఉత్పత్తిపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. పోటీలలో విజయం సాధించిన పలువురికి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు నగేష్, సుధాకర్, మొయినొద్దీన్, పాడి రైతులు పాల్గొన్నారు.

◆ క్షయవ్యాధిపై అవగాహన తప్పనిసరి

పటాన్‌చెరు టౌన్: క్షయ వ్యాధిపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ దేవేందర్ రాజ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రుద్రారం గ్రామ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి తీవ్రత అధికంగా ఉందన్నారు. రెండు వారాలకు మించిన దగ్గు, ఛాతిలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తెమడలో రక్తం పడటం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం లాంటి లక్షణాలుంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీబీ అలర్ట్ ఇండియా ప్రతినిధి డిస్టిక్ ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణ, శ్రవణ్, టీబీ అలర్ట్ ఇండియా డిస్టిక్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ రైతుల ఆందోళన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తమకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల తండా గిరిజన రైతులు ధర్నా నిర్వహించారు. వీరికి ఎంపీ రఘునందన్ రావు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య సంఘీభావం తెలిపారు. గిరిజనులకు అండగా ఉంటామని వారు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కాగా, ఆందోళన చేస్తున్న ఎంపీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మూలమలుపుల వద్ద చెట్ల తొలగింపు



చెట్ల కొమ్మలను తొలగిస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్

జిన్నారం (పటాన్‌చెరు): 'మూలమలుపులు ప్రమాద గంటికలు'అనే శీర్షిక గత రెండు రోజుల క్రితం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. పంచాయతీ సిబ్బంది స్పందించి జిన్నారం మండల కేంద్ర శివారులోని పోసాని కుంట ప్రధాన రహదారి మూల మలుపుల వద్ద ఏపుగా పెరిగిన చెట్లు కొమ్మలను గ్రామపంచాయతీ కార్మికులు తొలగించారు. ముందు వచ్చే వాహనాలు కనిపించకుండా రోడ్డుపైకి విస్తరించిన చెట్ల కొమ్మలను పూర్తిగా తొలగించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400